క్లుప్తంగా

438 మందికి వైద్య పరీక్షలు

గుడ్లవల్లేరు: ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు ఆధ్వర్యంలో గుడ్లవల్లేరు వైద్య శిబిరంలో ఆదివారం ఉచిత కార్పొరేట్ వైద్య పరీక్షలు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 438 మంది రోగులకు డాక్టర్లు వైద్య పరీక్షలు చేశారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఆరోగ్య సమస్యలున్న రోగులకు డాక్టర్ వెంకట్రావు, గుండె, ఊపిరి తిత్తులు తదితర సంబంధ వ్యాధులకు విజయవాడ కామినేని హాస్పిటల్ వైద్యులు ఎస్.దాశరథి, లింగంశెట్టి వర్ధన్, సాధారణ వైద్యానికి హోమియో వైద్యురాలు పి.భవాని, మానసిక రుగ్మతలకు హైదరాబాదుకు చెందిన డాక్టర్ హరిహర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

ఆలయాల అభివృద్ధికి రూ.51,116 విరాళం



గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్య నారాయణ స్వామి దేవస్థానం, శ్రీ గంగానమ్మ తల్లి ఆలయాల పునర్నిర్మాణ పనులకు పొట్లూరి వెంకటేశ్వరరావు, జయప్రదా దేవి స్మారకార్థం కుమారుడు శ్రీనివారరావు రూ.51,116 అందించారు. ఈ విరాళాన్ని గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎం విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావుకు అందజేశారు. ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవి, నెహ్రూ పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, కార్యదర్శి ఈడ్పుగంటి ఉమా, డైరెక్టర్లు వల్లభనేని బుడ్డిబాబు, పోలవరపు వెంకట్రావు, పాతూరి బుజ్జి, బి.శ్రీను, చాపరాల సుధాకర్, ఆలయ ధర్మకర్తలు మురాల నరేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనాల్లో ఘర్షణలపై కేసుల నమోదు

ముదినేపల్లి రూరల్: వినాయక నిమజ్జనాల్లో భాగంగా రెండు గ్రామాల్లో జరిగిన ఘర్షణలకు సంబంధించి నలుగురిపై స్థానిక పోలీసులు ఆదివారం కేసులు నమోదు చేశారు. ముదినేపల్లికి చెందిన వేమూరి నాగసురేష్ గురజలో శనివారం జరిగిన నిమజ్జనం సందర్భంగా స్నేహితుడు వెంకటేష్‌తో కలిసి పాల్గొన్నాడు. అక్కడ యుగంధర్, రోహిత్ అనే వ్యక్తులతో ఘర్షణ జరిగింది. దీంతో ఆదివారం చికెన్ దుకాణం వద్ద ఉన్న నాగ సురేష్‌పై యుగంధర్, రోహిత్‌లు దాడి చేయడంతో పాటు బెదిరించినట్లు పోలీసులు తెలిపారు. అదేవిధంగా వైవాకలో శనివారం జరిగిన నిమజ్జనం సందర్భంగా గ్రామానికి చెందిన కే.సూర్యతేజ, హరీష్‌లు నగుళ్ల నాగ దుర్గారావుపై మద్యం మత్తులో దాడి చేసినట్లు తెలిపారు. ఈ ఘర్షణలకు సంబంధించి బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ వీరభద్రరావు కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అల్లర్లకు కారకులపై చర్యలు

కైకలూరు: వినాయక విగ్రహ ఊరేగింపులో కైకలూరు శివారు దానిగూడెం దళితవాడలో చోటు చేసుకున్న ఘటనలో అల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆదేశించినట్లు కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. ఈ నెల 5వ తేదీన దానిగూడెం వద్ద జరిగిన దురదృష్టకర సంఘటనలో తన సొంత కొడుకులు ఉన్నా సహించబోనన్నారు. దానిగూడెంలో దాడికి గురైన బాధితులతో ఫోన్‌లో మాట్లాడినట్లు ఆయన పేర్కొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

గుడివాడరూరల్: స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలో ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం ఎస్ఐ ఎన్.చంటిబాబు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న రౌడీషీటర్లు, చెడునడత ఉన్న వ్యక్తులు నేరాలను వదిలి స్వేచ్ఛగా జీవించాలన్నారు. చెడు ప్రవర్తన కలిగిన వ్యక్తులు మారకపోతే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సమాచారం ఇవ్వాలన్నారు. అనుమానిత వ్యక్తులపై పోలీసుల నిఘా ఎప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ట్రెయినీ ఎస్ఐ లోకేశ్వరి, ఏఎస్ఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రేషను బియ్యానికి రెక్కలు

పట్టించుకోని అధికారులు

గుడ్లవల్లేరు: పేదలకు కేటాయించిన రేషను బియ్యాన్ని వారి పేదరికాన్ని అనుకూలంగా చేసుకునే కొన్ని ముఠాలు కాజేస్తున్నాయి. దీంతో ప్రభుత్వ పౌర సరఫరాల శాఖకు చెందిన రేషను దుకాణాల్లో రేషను బియ్యానికి రెక్కలు వస్తున్నాయి. మండలంలోని కొన్ని రేషను దుకాణాల్లో బియ్యానికి బదులుగా సొమ్మును లబ్ధిదారులకు దుకాణదారులు అంటగడుతున్నారు. దీంతో రేషను దుకాణాలు కాస్త వ్యాపార కేంద్రాలుగా మారిపోయాయని విమర్శలున్నాయి.

42 రేషను దుకాణాలు

గుడ్లవల్లేరు మండలంలో 42 రేషను దుకాణాలున్నాయి. కేజీ రేషను బియ్యాన్ని రూ.12కు రేషన్ డిపో నిర్వాహకులు కొనుగోలు చేస్తున్నారు. వినియోగదారుడు కొంచెం గడ్డుగా ఉంటే.. కిలో రూ.15కు కూడా కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ దందా అంతా ఒక సిండికేట్ ద్వారా దుకాణదారులతో అమలు పరుస్తున్నారనే సమాచారం. రేషను బియ్యం పక్కదారి పడుతున్నా పీడీఎస్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు.

పౌరసరాఫరాల శాఖ ద్వారా ప్రతి నెలా ఈ రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా చేస్తున్నారు. బియ్యం చేతిలో ఉండేసరికి రేషన్ డీలర్లు కొంతమంది వినియోగదారులకు బియ్యానికి బదులుగా నగదు ఎర వేస్తున్నారు. రేషను షాపుల నుంచి నల్ల బజార్లకు అడ్డూ అదుపు లేకుండా బియ్యం చేరుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రేషను దుకాణాల నుంచే నల్లబజారుకు..



లబ్ధిదారుల ఆమోదంతోనే..

లబ్ధిదారులకు మాయ మాటలు చెప్పి ఒప్పించి వారి ఆమోదంతోనే బియ్యాన్ని డీలర్లు కాజేస్తున్నారు. కార్డుదారుల బయోమెట్రిక్ పగడ్బందీగా తీసుకునే నగదు ఇస్తున్నారు. వినియోగదారుల నుంచి లారీల కొద్దీ కొనుగోలు చేస్తున్న బియ్యాన్ని రేషన్ డీలర్లు రాత్రివేళ గుట్టు చప్పుడు కాకుండా బయటకు తరలిస్తున్నారనే ఆరోపణలున్నాయి. రేషన్ బియ్యం వ్యాపారం డీలర్లకు మూడు పువ్వులు ఆరు కాయలుగా మారిందనే చర్చ సాగుతోంది. పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వాలు ఉచితంగా రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యం పక్కదారి పడుతున్నాయి.

రేషను డీలర్లే దళారులుగా..

గతంలో కొందరు రేషన్ బియ్యాన్ని దళారులకు విక్రయించి నగదు తీసుకునేవారు. ప్రస్తుతం రేషన్ దుకాణాల వద్దనే బియ్యం దందా నిర్వహిస్తున్నారు. కొందరు రేషన్ డీలర్లే దళారుల అవతారమెత్తి బియ్యం పంపిణీని నగదు బదిలీ కింద మార్చేస్తున్నారు. కరోనా సమయంలో ప్రజల కష్టాన్ని చూసి ఆహార భద్రత కింద కేంద్ర ప్రభుత్వం ద్వారా ఆనాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డుల వినియోగదారులకు ఉచిత బియ్యం పంపిణీ పథకం కొనసాగించింది. అదే పద్ధతినే ఈ రోజుకూ ఇస్తున్నారు. కొన్ని కుటుంబాల నుంచి ప్రతి నెలా బియ్యం కోటా తీసుకోగానే దళారులు కొందరు కొనుగోలు చేస్తున్నారు. తాజాగా రేషన్ డీలర్లే బియ్యం కొనుగోలు చేయడం విశేషం. జిల్లా అధికారులు స్పందించి రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై పీడీఎస్ డీటీ కె.రామశివను వివరణ కోరగా మండలంలో రేషను బియ్యం అమ్మకాలేవి తన దృష్టికి రాలేదన్నారు. అలా ఏమైనా ఉంటే విచారణ చేపట్టి, చర్యలు తీసుకుంటామన్నారు.



కొన్ని రేషను దుకాణాల్లో కొనుగోలు

గుడ్లవల్లేరు మండలంలోని కొన్ని రేషను దుకాణాల్లో వినియోగదారుల నుంచి రేషను బియ్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుంటే రేషను బియ్యం దందా చేసేవారిని అదుపు చేయవచ్చు. లేకపోతే బియ్యం కొనుగోళ్లు జరుగుతూనే ఉంటాయి.

– కోటప్రోలు నాగు, వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ



పేదరికాన్ని సొమ్ము చేసుకుంటున్నారు

పేదరికాన్ని సొమ్ము చేసుకుంటూ కొంతమంది రేషను బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. రేషను బియ్యాన్ని కొనుగోలు చేసి డిపోల్లో సొమ్ము ఇవ్వటం కంటే ప్రభుత్వమే కొత్త పథకాన్ని రూపొందించవచ్చు కదా. రేషను దుకాణాల్లో నగదు బదిలీల పేరిట కొత్త పథకాన్ని రూపొందిస్తే సరిపోతుంది.

– పిడుగు దేవసహాయం, సీపీఎం నాయకుడు, గుడ్లవల్లేరు మండలం

చినసత్యనారాయణ మాస్టార్‌కు సత్కారం



పెదపారుపూడి: ఉపాధ్యాయ వృత్తిలో మంచి పేరు సంపాదించుకున్న వ్యక్తి వాకా చినసత్యనారాయణ అని మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. పామర్రు మండలం జమీ గొల్వేపల్లి హైస్కూల్లో ఉద్యోగ విరమణ చేసిన చినసత్యనారాయణ సన్మాన సభ చిన పారుపూడి కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కైలే ఆయన్ను సత్కరించారు.

'మేము సైతం' టీం సభ్యుల సాయం



ముదినేపల్లి రూరల్: మండలంలోని పెయ్యేరు వైఎస్సార్ కాలనీకి చెందిన 'మేము సైతం టీం' సభ్యులు దివ్యాంగులు, రోడ్డు ప్రమాద బాధితులకు ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఎస్ఐ వీరభద్రరావు ముఖ్య అతిథిగా పాల్గొని ఒక బాధిత కుటుంబానికి నెల రోజులకు సరిపడా నిత్యాసవరాలు అందజేశారు. అదేవిధంగా న్యాయవాది పిచ్చికల పవన్‌కాంత్, గూడపాటి భానుప్రసాద్, బీజేపీ నాయకులు కోటప్రోలు కృష్ణ తదితరులు బాధిత కుటుంబాలు, కొందరు దివ్యాంగులకు సరుకులు అందించారు. టీం నిర్వాహకుడు మోవ్వా ఫణింద్ర ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది తనుకుల రవితేజ, సభ్యులు భూపతి రవీంద్ర, పాగోలు విజయసాగర్, ధర్మ, విజయ్, మధు, సాగర్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు రామలింగారెడ్డి మృతి

నివాళులర్పించిన మాజీ మంత్రి కొడాలి నాని

గుడివాడరూరల్: వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ గాదిరెడ్డి రామలింగారెడ్డి(83) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. మండలంలోని లింగవరం గ్రామంలోని స్వగృహంలో రామలింగారెడ్డి భౌతికకాయాన్ని మాజీ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని), వైఎస్సార్ సీపీ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, పాలడుగు రామ్‌ప్రసాద్, పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కొడాలి నాని మాట్లాడుతూ రాజకీయాల్లో తనకు వెన్నుదన్నుగా ఉండి, వైఎస్సార్ సీపీ స్థాపించిన నాటి నుంచి నేటి వరకు పార్టీ అభివృద్ధికి, లింగవరం గ్రామ సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి రామలింగారెడ్డి చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఆయనతో అనుబంధం మర్చిపోలేనిదన్నారు. ఆయన కుటుంబంలో నేను ఒకడిని అని పేర్కొన్నారు. తనకు పితృ సమానుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. ఆయన మృతి పార్టీతో పాటు తనకు తీరని లోటని పేర్కొన్నారు.



రామలింగారెడ్డి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మాజీమంత్రి కొడాలి నాని, నాయకులు

రామలింగారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటానని కొడాలి నాని ధైర్యం చెప్పారు. కాగా రామలింగారెడ్డికి భార్య, కుమారుడు ఉన్నారు. నివాళులర్పించిన వారిలో మాజీ మార్కెట్‌యార్డ్ చైర్మన్ మట్టా నాగమణి, గుడివాడ, నందివాడ ఎంపీపీలు గద్దే పుష్పారాణి, పెయ్యల ఆదాం, పార్టీ నాయకుడు మండలి హనుమంతరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, నాయకులు కందుల నాగరాజు, పొట్లూరి వెంకటకృష్ణారావు, గుడ్లవల్లేరు బాబ్జీ, టీడీపీ సీనియర్ నాయకుడు కొనకళ్ల బుల్లయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కల్లేపల్లి శంకర్ పాల్గొన్నారు.

రైతుల సమస్యలను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం

గుడివాడ టౌన్: చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలను గాలికి వదిలివేసిందని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అన్నదాత పోరు పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విత్తనాలు కొనడం నుంచి పంట అమ్మేవరకు ప్రభుత్వం ఏ దశలోనూ రైతులను ఆదుకోవడం లేదన్నారు. గిట్టుబాటు ధర లేక రైతులు నష్టాల బారిన పడి ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. ప్రస్తుత వరి సీజన్‌లో యూరియా దొరక్క రైతులు రోడ్డెక్కుతున్నా సకాలంలో స్పందించడంలేదన్నారు. పంట ఇన్సూరెన్స్ ప్రభుత్వం కట్టాల్సిండగా దానిని రైతుల మీద భారం మోపారంటే ప్రభుత్వం రైతుల పట్ల ఎంత నిర్లక్ష్య ధోరణితో ఉందో అర్థమవుతుందన్నారు. ప్రభుత్వం మొద్దు నిద్రను లేపేందుకు ఈనెల 9వ తేదీ ఉదయం 10 గంటలకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆర్డీఓ కార్యాలయాల వద్ద రైతులతో కలిసి వినతిపత్రాన్ని అందజేయాలని వైఎస్సార్ సీపీ నిర్ణయించిందన్నారు. నియోజకవర్గంలోని రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎంవీ నారాయణరెడ్డి, ఎంపీపీ పెయ్యల ఆదాము, జిల్లా కార్యదర్శి కె.నాగరాజు, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌కే ఆలీసాహెబ్(బాజి), మున్సిపల్ ప్లానింగ్ వింగ్ అధ్యక్షుడు అడబాల అప్పారావు, బీసీ సెల్ అధ్యక్షుడు చుండూరి శేఖర్, ప్రచార విభాగం అధ్యక్షుడు గంటా శ్రీనివాసరావు, కె.ఆంజనేయ ప్రసాదు, సీహెచ్ నాగూర్, పి. కృష్ణారావు, షమ్ము, ఎండీ కాలేహా, మాదాసు వెంకటలక్ష్మి, మూడెడ్ల ఉమ, సురేఖ, హారిక తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

యూరియా అందక అన్నదాతల అవస్థలు

పమిడిముక్కల: యూరియా అందక అన్నదాతలు అవస్థలు పడుతున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా వలంటీర్ విభాగం అధ్యక్షుడు పోలిమెట్ల వంశీకృష్ణ అన్నారు. మండలంలోని మేడూరు గ్రామంలోని సొసైటీలో సన్న, చిన్నకారు రైతులకు రెండు బస్తాలకు మించి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతూ, పెద్ద రైతులకు కావల్సినంతా యూరియా అందజేస్తున్నారని ఆరోపించారు. మూడు వేల ఎకరాల ఆయుకట్టు ఉన్న మేడూరుకు అవసరమైన మేర యూరియా సరఫరా చేయాలని కోరారు. యూరియా సరఫరా చేయాలని ఈనెల 9న ధర్నా చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనోత్సవం



వడ్లమన్నాడులో వినాయకుని ఊరేగింపు

గుడ్లవల్లేరు: మండలంలోని వినాయక విగ్రహ నిమజ్జనోత్సవాలు శని, ఆదివారాల్లో ఘనంగా నిర్వహించారు. పురటిపాడు బాల వినాయక కమిటీ వారు స్వామిని యువతీయువకులు నిర్వహించిన కర్ర సాము, కోలాట ప్రదర్శనలు, తీన్‌మార్, కనక డప్పుల వాయిద్యాలతో గుడ్లవల్లేరు ప్రధాన వీధుల్లో ఊరేగించారు. స్వామితో పాటు మహిళా భక్తులు, చిన్నారులు సైతం భారీ సంఖ్యలో ఊరేగింపులో పాల్గొన్నారు. వడ్లమన్నాడులో వేంచేసిన శ్రీ విజయ గణపతి దేవస్థానం ఆధ్వర్యంలో వినాయక నిమజ్జనం శోభాయమానంగా జరిగింది.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం ఎ.సీతారామపురంలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న జూదశిబిరంపై వీరవల్లి పోలీసులు ఆదివారం దాడి చేశారు. జూదశిబిరం నిర్వహణపై విశ్వసనీయ సమాచారం అందటంతో వీరవల్లి ఎస్ఐ ఎం.శ్రీనివాస్ నేతృత్వంలో పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.26,530, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. చట్టవిరుద్ధంగా పేకాట, కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హామీలను విస్మరించిన చంద్రబాబు



దోసపాడులో అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించిన కైలే అనిల్‌కుమార్

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్

దోసపాడు(పెదపారుపూడి): ఎన్నికల సమయంలో వందకు పైగా హామీలను ఇచ్చిన చంద్రబాబు గెలిచిన తరువాత ఖజానా ఖాళీ అంటూ పథకాలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని దోసపాడులో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్ కల్యాణ నోటికి వచ్చిన హామీలన్నీ ఇచ్చి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వాటిని గాలికి వదిలేశారన్నారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని వర్గాలకు న్యాయం చేసిందని తెలిపారు. కార్యకర్తలు క్యూఆర్ కోడ్ డౌన్లోడ్ చేసుకుని చంద్రబాబు చేసిన మోసం ఎండగట్టాలన్నారు. అనంతరం గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా డి.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శులుగా ఇంటేటి డేవిడ్ రాజు, మూల్పూరి మోహనరావు, కుమ్మరి వెంకటేశ్వరరావు, బల్లవరపు నాగేశ్వరరావు, కార్యదర్శులుగా గోవాడ నాగమలేశ్వరరావు, జోగి ఆంజనేయులు, తిరుమాని శివరామకృష్ణప్రసాద్, దన్నే చక్రవర్తిని ఎంపిక చేశారు.

అన్నదాత పోరుకు సిద్ధం కావాలి

వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తర్వలో జరిగే అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రైతుల తరఫున పోరుబాటకు సిద్ధంగా ఉండలన్నారు. అనంతరం అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గోగం సురేష్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మూల్పూరి హరీష, నాయకులు మూల్పూరి చంద్రశేఖర్, కుమ్మరి రాజేష్, బొల్లవరపు దాసు తదితరులు పాల్గొన్నారు.

హుండీల్లోని నగదు చోరీ

పెదపూడి(మొవ్వ): పెదపూడిలోని శ్రీ సంపత్ వినాయకుడి ఆలయంలోని హుండీల్లోని నగదు శనివారం అర్ధరాత్రి చోరీకి గురైంది. ఆలయ నిర్వాహకుల సమాచారం మేరకు సీసీ కెమెరాల ఆధారంగా చోరీ చేసిన ఇద్దరిని పోలీసులు అదుపులో తీసుకుని విచారణ చేపట్టారు.

కొండలమ్మ సన్నిధిలో చండీ హోమం



కొండలమ్మ దేవస్థానాన్ని మూసి వేస్తున్న అర్చకులు, సిబ్బంది



చండీ హోమం నిర్వహిస్తున్న అర్చకుడు శివ సంతోష్

గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరం శ్రీ కొండలమ్మవారి ఆలయంలో ఆదివారం చండీ హోమాన్ని వేద మంత్రోచ్చరణ నడుమ నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు రుద్రపాక శరశ్చంద్ర శివ సంతోష్ వేద పండితుల బృందం ఈ హోమాన్ని చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఆలయం మూసివేత

గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం 12.30గంటల నుంచే చంద్ర గ్రహణం కారణంగా మూసివేశారు. సోమవారం విడుపు స్నానం, శ్రీ అమ్మవార్లకు ఏకాంత అర్చనలు, పూజా కార్యక్రమం అనంతరం ఉదయం 9 గంటలకు పునరదర్శనం కల్పించనున్నట్లు ఈఓ ఆకుల కొండలరావు పేర్కొన్నారు.



మూసివేసిన వెంకటేశ్వరుని దేవస్థానం

చంద్ర గ్రహణంతో ఆలయాల మూసివేత

కూచిపూడి(మొవ్వ): సంపూర్ణ చంద్ర గ్రహణం సందర్భంగా ఆదివారం మొవ్వ మండలంలోని ఆలయాలు మూసివేశారు. కూచిపూడిలోని శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం ఆలయ పాలక మండలి సభ్యులు పసుమర్తి నారాయణమూర్తి, అర్చకులు పెనుమూడి సతేష్ కుమార శర్మ, పెనుమూడి పూర్ణచంద్ర శేఖర శర్మలు తాళాలు వేశారు.

శ్రీ వేంకటేశ్వరునికి చంద్ర గ్రహణ ప్రత్యేక పూజలు

గుడ్లవల్లేరు: మండలంలోని డోకిపర్రు శ్రీ భూసమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానం 'సంపూర్ణ చంద్ర గ్రహణం' కారణంగా ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు మూసివేశారు. దేవస్థాన వ్యవస్థాపకులు, మెయిల్ అధినేతలు పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో సాయంత్రం నాలుగు గంటల నుంచి సాయంత్రం అర్చన, శుద్ధి, ఏకాంతసేవ చేసిన వేద పండితులు ఐదు గంటలకు స్వామి ఆలయం మూసివేశారు. సోమవారం ఉదయం 8.30 గంటల నుంచి స్వామి దర్శనం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.



దత్తాశ్రమంలో హోమం

దత్తాశ్రమంలో..

మండవల్లి: చంద్రగ్రహణ సందర్భంగా లోకుమూడి దత్తాశ్రమంలో గణపతి పూజ, చండీ మహాయాగాన్ని ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సమీప ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దత్తాశ్రమ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ గురజాడ ఉదయ శంకర్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: చంద్రగ్రహణం సందర్భంగా సింగరాయపాలెం–చేవూరిపాలెం సెంటర్‌లో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాన్ని అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో స్వామికి పూజలు చేసి మూసివేశారు. రెండో పూరిగా ప్రసిద్ధి చెందిన వడాలి శ్రీ జగన్నాథస్వామి ఆలయాన్ని సైతం మూసివేశారు. సంప్రోక్షణల అనంతరం సోమవారం ఉదయం 9 గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పిస్తామని ఆయా ఆలయాల ఈఓలు ఆర్.గంగాశ్రీదేవి, శ్రీనివాసరావు తెలిపారు.